క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల సంబరాలు



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో మహబూబ్‌నగర్ డిపోలో గురువారం ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఇందుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జీఎల్‌గౌడ్, శ్రీనివాస్, వెంకటయ్య, చిట్టెమ్మ, యాదమ్మ, రాందాస్ పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' నమోదులో వేగం పెంచాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గృహలక్ష్మి పథకం దరఖాస్తుల పరిశీలన, నమోదులో వేగం పెంచాలని కలెక్టర్ రవినాయక్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి మండలాల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన, ఆన్‌లైన్‌లో నమోదు, ఉత్తర్వుల జారీ, యూనిట్ల గ్రౌండింగ్‌పై సమీక్షించారు. అడిషనల్ కలెక్టర్ మోహన్‌రావు, ఇన్‌చార్జ్ అడిషనల్ కలెక్టర్ యాదయ్య, డీఆర్‌ఓ రవికుమార్ ఉన్నారు.

బాధితుడికి పరామర్శ

అడ్డాకుల: మండలంలోని గుడిబండకు చెందిన శివయాదవ్‌పై గుర్తుతెలియని దుండగులు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఎస్వీఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న డీసీసీ మధుసూదన్‌రెడ్డి గురువారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. కాగా, సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ మాధవరెడ్డి గ్రామంలో విచారణ నిర్వహించారు.

బూర్గులకు ఘననివాళి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి దివంగత బూర్గుల రామకృష్ణారావు వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జంతుశాస్త్ర అధ్యాపకురాలు నీరజ, ఎన్‌ఎస్‌ఎస్ అధి కారి సదాశివయ్య, బోధనేతర సిబ్బంది శ్రీనివాసులు, సుధీర్‌రెడ్డి, ప్రతాప్ పాల్గొన్నారు.

అధ్యాపకుడికి డాక్టరేట్

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ ఫార్మసీ విభాగం అధ్యాపకుడు చింతల రవికాంత్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఓయూ ప్రొఫెసర్ నారాయణసింగ్ ఆధ్వర్యంలో రవికాంత్ 'స్టడీస్ ఆన్ యాంటీ క్యాన్సర్, యాంటీ డయాబెటిక్ ప్రాపర్టీస్ ఆఫ్ కార్కుమిన్ యాంటీ బీటా కెరోటిన్ నానోపార్టికల్స్' అనే అంశంపై పరిశోధనలు చేశారు. ఇందుకుగాను ఆయనకు డాక్టరేట్‌ను ప్రకటించింది. ఈ సందర్భంగా గురువారం పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్ అభినందనలు తెలిపారు.

పీయూ విద్యార్థికి..

పీయూ మైక్రోబయాలజీ విభాగం రీసెర్చ్ స్కాలర్ సంజీవ్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేయనున్నట్లు కంట్రోలర్ రాజ్‌కుమార్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో 'ఫార్ములేషన్ అండ్ ఎవల్యూషన్ ఆఫ్ పాలిబయో ఇనాక్యులెంట్స్ సెలెక్టెడ్ క్రాప్ ప్లాంట్స్' అంశంపై పరిశోధనలకుగాను డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంజీవ్‌కుమార్‌ను వీసీతోపాటు రిజిస్ట్రార్ గిరిజ, మధుసూదన్‌రెడ్డి, చంద్రకిరణ్, శాంతిప్రియ అభినందించారు.

అందరి సంక్షేమానికి కృషి

రాజాపూర్: ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమానికి కృషి చేస్తోందని సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బచ్చిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బూరుగు చెరువులో గురువారం చేపపిల్లలను విడుదల చేశారు. అదేవిధంగా కుచ్చర్‌కల్ చెరువులో సర్పంచ్ సుధారాణి, రంగారెడ్డిగూడ చెరువులో సర్పంచ్ శశికళారెడ్డి చేపపిల్లలను వదిలారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పార్లమెంట్ ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టి చట్టబద్ధత కల్పించాలని ఎంఎస్‌ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎంవీఎస్ కళాశాల ఎదుట ప్రధాన రహదారిపై ఎంఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్తీక్, సుధాకర్, నాగేందర్, సాంబ, పంతీస్, నర్సింహ పాల్గొన్నారు.

వెంకటయ్యకు సేవారత్న అవార్డు

బాలానగర్: అంబేద్కర్ సంఘం మండల ఉపాధ్యక్షుడు వెంకటయ్య జాతీయ సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. అక్టోబర్ 15న న్యూఢిల్లీలో నిర్వహించనున్న ఆలిండియా బహుజన రైటర్స్ 4వ కాన్ఫరెన్స్‌లో అవార్డును ప్రదానం చేయనున్నట్లు ఆయన తెలిపారు.

కళాశాల పనులు పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్ : జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం కళాశాల ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. మహేష్, శివ, కర్ణాకర్, అమర్, శివ, దినేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు



బాలానగర్ మండలస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు



మూసాపేటలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

బాలానగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాల, కళాశాల ఆవరణలో గురువారం మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. అండర్-17, 14 విభాగాల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహం పాల్గొని ప్రతిభ చాటారు. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లకు టీఎస్‌ఆర్‌ఎస్ ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి, ఈఎంఆర్‌ఎస్ లక్ష్మారెడ్డి, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం అయ్యపురెడ్డి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీఈటీలు అరుణ, రాములు, కృష్ణయ్య, వెంకటమ్మ, హిమబిందు పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట ఉన్నత పాఠశాల ఆవరణలో మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. అండర్-14, 17 విభాగాల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో ప్రతిభకనబర్చిన బాలబాలికలను జిల్లాస్థాయికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో శశికళ, నిరంజన్‌రావు, విశాలి, రాజశేఖర్, రాజవర్ధన్‌రెడ్డి, వడ్డెన్న, మొగులాల్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎంపీపీ సుదర్శన్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మండలస్థాయి క్రీడాపోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో అత్యుత్తమ ప్రతిభకనబర్చిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపిక చేసినట్లు పీడీ పురుషోత్తం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, సర్పంచ్ రాధిక, ఎంపీటీసీ గౌస్, ఎస్‌ఎంసీ చైర్మన్ సురేందర్‌గౌడ్, పర్వతాలు, సాయన్న పాల్గొన్నారు.

సీఎం సభకు భారీగా తరలిరావాలి



మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య

జడ్చర్ల టౌన్: కొల్లాపూర్‌లో శనివారం నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య కోరారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతో జిల్లా సస్యశ్యామలం అవుతుందన్నారు. ప్రతి గ్రామం నుంచి తరలివచ్చి కృష్ణాజలాలతో దేవుళ్ల పాదాలు కడుగుదామని పిలుపునిచ్చారు. సమావేశంలో సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి పాలాది రామ్మోహన్, శంకర్‌నాయక్ ఉన్నారు.

మిడ్జిల్: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభోత్సవం సందర్భంగా కొల్లాపూర్‌లో నిర్వహించే సీఎం కేసీఆర్ బహిరంగ సభకు మండలం నుంచి ప్రజలు భారీగా తరలిరావాలని ఎంపీపీ సుదర్శన్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి 50 మంది తక్కువ కాకుండా ప్రజలు, కార్యకర్తలు తరలిరావాలని సూచించారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పాండుయాదవ్, బాలు, జంగారెడ్డి, రవి, రమేష్‌నాయక్, భాస్కర్, శ్రీనువాసులుగుప్తా, భీంరాజ్, జగన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నవాబుపేట: కొల్లాపూర్‌లో నిర్వహించనున్న సీఎం కేసీఆర్ బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో బయల్దేరి వెళ్లనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంపీపీ అనంతయ్య, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు తాహేర్, ప్రతాప్, ముడా డైరెక్టర్ చెన్నయ్య, సర్పంచులు గోపాల్‌గౌడ్, యాదయ్య, కొండాపూర్ యాదయ్య ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

రాజాపూర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని టీపీసీసీ కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌లో ఉన్న వారే మళ్లీ చేరుతున్నారు తప్ప, కాంగ్రెస్ పార్టీ వారు ఎవ్వరు చేరడంలేదన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ తోపాటు రైతులకు ఏకకాలంలో రుణమాఫీ అమలు చేస్తామన్నారు.ఈనెల 17న తుక్కుగూడలో నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ విజయభేరీకి ప్రతి కార్యకర్త హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కృష్ణయ్య, శేఖర్‌గౌడ్, రమేష్‌రెడ్డి ఉన్నారు.



రాజాపూర్‌లో మాట్లాడుతున్న అనిరుధ్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: హైదరాబాద్‌లో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరి సభ విజయవంతానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మహబూబ్‌నగర్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ అస్లాం భాషా కోరారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభలో సోనియాగాంధీతో పాటు ఇతర అగ్రనాయకులు పాల్గొంటున్నట్లు తెలిపారు. సమావేశంలో మోహన్‌కుమార్ మంగళం, సంజీవ్ ముదిరాజ్, సిరాజ్‌ఖాద్రీ, సాయిబాబా, లక్ష్మణ్‌యాదవ్, వెంకటయ్య ఉన్నారు.

నిరంకుశ పాలనకు చరమగీతం పాడుదాం



జడ్చర్లలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

పాలమూరు: రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి చరమగీతం పాడుదామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి అన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేయడంపై గురువారం జిల్లా కేంద్రంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని శాంతియుతంగా దీక్ష చేపడితే అణచివేయడం సరికాదన్నారు. బాలరాజు, పాండురంగారెడ్డి, చిన్న వీరయ్య, సుబ్రహ్మణ్యం, ప్రవీణ్, నారాయణయాదవ్, రమేష్ పాల్గొన్నారు.

అడ్డాకుల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో నియోజకవర్గ నాయకుడు బాలన్న ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. మూసాపేట మండల కేంద్రంలోనూ బీజేపీ నాయకులు సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు.

జడ్చర్ల టౌన్: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దీక్షను భగ్నం చేయడాన్ని నిరసిస్తూ గురువారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సామల నాగరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌జీ, కౌన్సిలర్ కుమ్మరిరాజు, మధు, శ్రీనివాస్‌గౌడ్, నరేష్, జ్యోతి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల నిరసన

చిన్నచింతకుంట: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్ట్‌పై మండల కేంద్రంలో ఆ పార్టీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు, అసెంబ్లీ కన్వీనర్ రమేష్, దశరథ్, నరేందర్‌జీ, రాములు, కృష్ణారెడ్డి, చంద్రుడు, శ్రీగురు, కురుమూర్తి, సరోజ్‌రెడ్డి పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటు

జడ్చర్ల టౌన్: హిందీ భాషాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం తోడ్పాటు అందిస్తుందని స్థానిక బీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ అన్నారు. హిందీ దివస్‌ను పురస్కరించుకొని గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. హిందీ భాషలో ప్రావీణ్యం పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. హిందీ విభాగాధిపతి నర్సింహారావు, కల్యాణి, సుభాషిణి, వెంకట్‌రెడ్డి, విఠల్ పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రాచీన భాషల్లో హిందీ ఒకటని వాసవీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసయ్య అన్నారు. వాసవీ డిగ్రీ కళాశాలలో హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. అకాడమిక్ డైరెక్టర్ రజినీకాంత్, ప్రిన్సిపాల్ కొండస్వామి, వీహెచ్‌పీ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

హన్వాడ: మండల కేంద్రంలోని దిఎవరెస్ట్ టాలెంట్ స్కూల్‌లో హిందీ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజేందర్‌జీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని కేశ్వాపూర్ పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు సన్మానించారు. హిందీ పండిట్ సురేష్ బాబు, హెచ్‌ఎం ఖాజా నాసర్‌ఖాన్ పాల్గొన్నారు.

రుద్రస్వాహాకార యజ్ఞం

జడ్చర్ల టౌన్: శ్రావణమాసం అమావాస్యను పురస్కరించుకొని బాదేపల్లి భాగ్యేశ్వరాలయంలో గురువారం రుద్రస్వాహాకార యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, రుద్రాభిషేకం చేశారు. శ్రీగిరి అష్టలక్ష్మి ఆలయంలో కృష్ణస్వామి నేతృత్వంలో చండీహోమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భార్గవశర్మ, రమేష్‌శర్మ, కిరణ్‌శర్మ, శ్రీకాంత్ శర్మ, రామచందర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

గండీడ్: మండలంలోని వెన్నాచేడ్ బండమీది రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం ముగింపు సందర్భంగా శుక్రవారం సీతారాముల ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

కోయిల్‌కొండ: మండలంలోని ఆచార్యాపూర్ వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు అర్చకుడు దిలీప్‌కుమార్‌శర్మ తెలిపారు.

నవాబుపేట: కృష్ణాష్టమిని పురస్కరించుకుని త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంతోపాటు చౌడూర్, కొల్లూర్ గ్రామాల్లో శ్రీకృష్ణుడి విగ్రహాలతో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాటం, భజన కార్యక్రమాలు అలరించాయి. బుచ్చిలింగం, నాగ్యానాయక్, వేణు, నర్సింహులు, అక్షయ్, పురుషోత్తం, తిరుపతయ్య, యాదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దదర్‌పల్లికి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు



హన్వాడ: మండలంలోని పెద్దదర్‌పల్లికి రాష్ట్రస్థాయి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 అవార్డు లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా చేతులమీదుగా సర్పంచ్ వెంకన్న అవార్డును అందుకున్నారు. కమిషనరేట్ ఆడిట్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ హన్మంతురావు, సీఈఓ జ్యోతి, డీపీఓ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ధనుంజయగౌడ్, ఎంపీఓ వెంకట్‌రెడ్డి, ఎస్‌బీఎం టీం రవి, పంచాయతీ కార్యదర్శి రమాదేవి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

హన్వాడ: మండలంలోని గుడి మల్కాపూర్‌కు చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు గురువారం ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి మంత్రి గులాబీ కండువా కప్పి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో కొత్త యాదిరెడ్డి, ఎరుకలి అంజయ్య, దొబ్బలి యాదయ్య, గొల్ల తిరుపతయ్య, బాల్‌రాజు, సాయిలు, గొల్ల లక్ష్మయ్య, గోపాల్, చెన్నయ్య, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలగౌడ్, ముడా డైరెక్టర్ బాలయ్య, ఎఫ్‌పీసీఎస్ వైస్‌చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మాజీ జెడ్పీటీసీ నరేందర్ పాల్గొన్నారు.

బీసీసెల్ నాయకుడికి సన్మానం

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ బీసీసెల్ మండల అధ్యక్షుడు మల్లేష్‌యాదవ్‌ను గురువారం మండల కేంద్రంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బంగ్లరవి, మండల నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, జంగయ్య, ఆంజనేయులు, కుమార్, రమేష్, కాశన్న, వెంకటేష్, వెంకటస్వామి మల్లేష్, నరేష్, నర్సింహులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ కార్యాలయం ముట్టడి

జడ్చర్ల: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయాన్ని ముట్టడించారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నుంచి తరలివచ్చిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. అనంతరం సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సత్తయ్య, జగన్, దీప్లా నాయక్, కృష్ణయ్య, ప్రభావతి, సరోజ, రాజ్యలక్ష్మి, హైమావతి, పద్మ, మైమూదా పాల్గొన్నారు.

దేవరకద్ర రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డీసీసీ అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో అంజల్‌రెడ్డి, వెంకటనర్సింహారెడ్డి, గోవర్ధన్‌గౌడ్, ఓంప్రకాష్‌రెడ్డి, కిరణ్ పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు శుభ్రం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన టెట్ పరీక్ష కేంద్రాలను గురువారం మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. కేంద్రాల పరిసరాలతోపాటు తరగతి గదులు, టాయ్‌లెట్లను పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించినట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, వాణీకుమారి తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

గండీడ్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వక్తలు కృష్ణస్వామి, రమామోహన్ అన్నారు. మండలంలోని వెన్నాచేడ్‌లో నిర్వహిస్తున్న హనుమాన్ చాలీసా పారాయణం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవజన్మ ఎన్నో పుణ్యాలు చేసుకుంటే తప్ప రాదన్నారు. మనిషి భోగభాగ్యాలకు అలవాటు పడి రోగాలు కొని తెచ్చుకుంటున్నారన్నారు. దీన్ని నుంచి బయట పడేందుకు ధర్మ మార్గంలో పయనించాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను పూజించడం అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం భజన కార్యక్రమం నిర్వహించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సత్యసాయి సేవాసమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ శివమల్లప్ప, గోపాల్, రామలింగమ్మ, చిన్నయ్య, కర్నె వెంకటయ్య, కృష్ణయ్య, రాఘవరెడ్డి, నిరంజన్, వెంకటేష్, నరేందర్‌రెడ్డి, బుగ్గయ్య, సుభాష్, నరేష్ పాల్గొన్నారు.

యూరియా కొరత రానివ్వొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

భూత్పూర్: రైతులకు యూరియా కొరత ఏర్పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకు యూరియా కొరతపై సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేస్తున్నారని, మండలంలో అలాంటి సమస్య లేకుండా చూడాలని ఏఓ మురళీధర్‌కు సూచించారు. రైతుబంధు, బీమా, రుణమాఫీ వివరాలను గ్రామాల వారీగా ఇవ్వాలన్నారు. తాటికొండ క్లస్టర్ ఏఈఓ రైతులు, సర్పంచులకు అందుబాటులో ఉండటంలేదని, ఫోన్‌లో సంప్రదించినా స్పందించడంలేదని పలువురు సభ దృష్టికి తీసుకొచ్చారు. రుణమాఫీ సమస్యలను ఎవరి దృష్టికి తీసుకురావాలో తెలియక రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తహసీల్దార్ భానుకిరణ్, వైస్‌ఎంపీపీ నరేష్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, ఎంపీడీఓ మున్ని ఉన్నారు.

'పాలమూరు' నిర్వాసితుల సమస్యలు పట్టవా?



ఉదండాపూర్‌లో నిర్వాసితులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

జడ్చర్ల: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి భూములు, ఇళ్లను ధారాదత్తం చేసిన నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు మండిపడ్డారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో ముంపునకు గురవుతున్న వల్లూరు, ఉదండాపూర్ గ్రామాల్లో గురువారం సీపీఎం నాయకులు పర్యటించి, నిర్వాసితుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు రిజర్వాయర్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతుండగా, నిర్వాసితులకు సంబంధించిన పునరావాస పనులు నత్తనడకన సాగుతున్నాయని అన్నారు. ఇప్పటి వరకు భూపరిహారం పూర్తిస్థాయిలో అందలేదని, భూములను స్వాధీనం చేసుకొని ఉపాధి లేకుండా చేశారన్నారు. నిర్వాసితులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిల్లె గోపాల్, దీప్లానాయక్, జగన్, మాణిక్యం, సత్తయ్య, రాజు, శంకర్ పాల్గొన్నారు.

దాబాలో మద్యం స్వాధీనం

హన్వాడ: మండలంలోని చిన్నదర్‌పల్లి శివారులో ఉన్న సునీత దాబాను గురువారం పోలీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దాబాలో అక్రమంగా నిల్వ ఉన్న 12 బీర్లు, రెండు ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దాబా నిర్వాహకుడు శ్రీనివాసులుపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

హన్వాడ: మండలంలోని చిన్నదర్‌పల్లి హనుమాన్ టెంపుల్ తండా శివారులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యజమాని నర్సింహులుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇసుకను అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాహనాల తనిఖీ

మిడ్జిల్: మండలంలోని మున్ననూర్ టోల్‌ప్లాజా వద్ద గురువారం పోలీసులు, ఆర్టీసీ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆటోలు ఇతర వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. డీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

మహమ్మదాబాద్: మండలంలోని వెన్నాచేడ్‌కు చెందిన చెందిన దొడ్డెరాజు అదే గ్రామానికి చెందిన జ్యోతిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అమ్మాయి తల్లిదండ్రులకు తెలియకుండా వివాహం చేసుకోవడంతో నిత్యం రాజుతో గొడవ పడేవారు. ఈ క్రమంలో ఈనెల 12న రాజుపై రాములు, కృష్ణ, అంబమ్మ, బుగ్గయ్య, పద్మమ్మ, ఆంజనేయులు కలిసి దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

చేపపిల్లల విడుదల

మిడ్జిల్: మండలంలోని అయ్యవారిపల్లి కిష్టమ్మ చెరువులో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో చేపపిల్లలను వదిలారు. కార్యక్రమంలో రామకృష్ణ, మల్లేష్, రాములు, ఆంజనేయులు, గోపాల్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

దేవరకద్ర రూరల్: మండల కేంద్రానికి జలాల్ గతనెల 23న తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. దీనిపై అదే రోజు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. సీఈఐఆర్ అప్లికేషన్‌తో గుర్తించి, గురువారం బాధితుడికి అందజేసినట్లు ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.

అంబులెన్స్ పరిశీలన

జడ్చర్ల టౌన్: జీవీకె ఈఎంఆర్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 1962 అంబులెన్స్‌ను గురువారం జిల్లా పశు వైద్యాధికారి శివాని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలోని పరికరాల పనితీరును తెలుసుకున్నారు. మందుల నిల్వపై ఆరా తీశారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మేనేజర్ రవి, విధుభూషణ్‌రెడ్డి, సంధ్య, నితీన్, సతీష్ ఉన్నారు.

కేసు నమోదు

అడ్డాకుల: మూసాపేట మండలం అచ్చాయపల్లిలో మద్యం విక్రయిస్తున్న బెల్టుషాపు నిర్వాహకుడిపై గురువారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ అంజనేయులు తెలిపారు. కిరాణ దుకాణం నిర్వహిస్తున్న సురేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు.. దాడి చేసి 12 బీర్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.